క్లుప్తంగా...

శంషాబాద్‌లో పోలీసుల కవాతు



కవాతు చేస్తున్న పోలీసు బలగాలు

శంషాబాద్: ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో పోలీసుల కవాతు నిర్వహించారు. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌కు పెద్దఎత్తున పోలీసు బలగాలు చేరుకున్నాయి. పట్టణంలోని సిద్ధప్పరోడ్డు, ఆర్బీనగర్, మధురానగర్, అహ్మద్‌నగర్ తదితర బస్తీల గుండా పోలీసులు పెద్ద ఎత్తున కవాతు చేపట్టారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న భక్తులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, మైహోం అవతార్ అపార్ట్‌మెంట్స్ సమీపంలోని శ్రీ సంకటహరణ హనుమాన్ దేవాలయం ఆవరణలో చేపట్టిన శ్రీ రాజరాజేశ్వరి మాత విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభమైన పూజలు మధ్యాహ్నానికి పూర్తయ్యాయి. దేవాలయ ఆవరణలో ఇప్పటికే ఏర్పాటు చేసిన శివలింగం పక్కనే అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. పూజల అనంతరం నార్సింగి నర్సింగ్‌రావు భజన బృందం భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ నాయకులు పీసరి శ్రీనివాస్ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'సైబర్ క్రైమ్స్ అవేర్‌నెస్' అనే అంశంపై సైబరాబాద్‌లోని ఎస్‌సీఎస్‌సీ సైబర్ సెక్యూరిటీ సీనియర్ మేనేజర్, సైబర్ రక్షక్ ఆపరేషన్స్ హెడ్ భానుయాచరేని ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

తెలంగాణ ఉద్యమంలో నీళ్లు, నియామకాలు ప్రధాన అంశాలు

రాయదుర్గం: తెలంగాణ ఉద్యమంలో అనేక అంశాలున్నా నీరు.. నియామకాలు ప్రధాన అంశాలుగా ముందుకొచ్చాయని విశ్రాంత ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన 'తెలంగాణ రాష్ట్రంలో సామాజిక-రాజకీయ గతి' అనే అంశంపై రెండు రోజుల సదస్సులో ఆయన కీలక ఉపన్యాసం చేశారు. తెలంగాణ ఉద్యమంలోని ముఖ్య ఘట్టాలను ఆయన వివరించారు. హరితవిప్లవం, ఎమర్జెన్సీ, నీటి వనరుల చుట్టూ ఉన్న వివాదాలు వంటి కీలక సమస్యలు, ప్రక్రియలపై మాట్లాడారు. ప్రొఫెసర్ ఎస్.సుకుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంతో ముడిపడి ఉన్న సాంప్రదాయాలు, ఆదర్శాల గురించి వివరించారు. కార్యక్రమంలో 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్ షరీదా సిద్దీఖీ, ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్, ప్రొఫెసర్ ఏ నాగేశ్వరరావు, డాక్టర్ షబానా ఫర్వీన్, ముజఫర్‌హుస్సేన్ ప్రసంగించారు.

వార్డు మెంబర్ నుంచి ఎమ్మెల్యే దాకా.. !

రాష్ట్రంలో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఈ నియోజకవర్గంలో వార్డు మెంబర్ నుంచి ఎమ్మెల్యే దాకా ప్రజా ప్రతినిధులు ఉండటం విశేషం. రాజేంద్రనగర్ నియోజకవర్గం 2009లో కొత్తగా ఏర్పడింది. అంతకు ముందు చెవేళ్ల నియోజకవర్గంలో అంతర్భాగంగా కొనసాగేది. పునర్విభజన అనంతరం శంషాబాద్, రాజేంద్రనగర్ రెండు మండలాలను కలుపుతూ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం రాజేంద్రనగర్ నియోజకవర్గంగా కొనసాగుతోంది.

- రాష్ట్రంలోనే విభిన్నంగా రాజేంద్రనగర్
- 2009లో ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో 27 గ్రామ పంచాయతీలు, ఒక గ్రేటర్ కార్పొరేషన్, ఒక మున్సిపల్ కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు కొనసాగుతున్నాయి. అటు రంగారెడ్డి జిల్లా, ఇటు హైదరాబాద్ జిల్లాలో నియోజకవర్గంగా విస్తరించి ఉంది. గ్రామీణ వాతావరణంతో పాటు హైటెక్ వాతావరణం ఈ నియోజకవర్గంలో కనిపిస్తుంది. 27 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ వ్యవస్థ నడుస్తుంది. ఇక్కడ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు ప్రజా ప్రతినిధులు కొనసాగుతున్నారు.

- శంషాబాద్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలలో చైర్మెన్‌లు, వైస్ చైర్మెన్లు, కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులుగా ఉన్నారు. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు ప్రజా ప్రతినిధులుగా తమ విధులు నిర్వహిస్తున్నారు.
- రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ఐదు జీహెచ్‌ఎంసీ కార్పొరేషన్ డివిజన్లు ఉండగా.. ఈ డివిజన్లకు కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. వీరందరితో పాటు కో- ఆప్షన్ సభ్యులు అదనంగా ఉన్నారు. రాష్ట్రంలోని ఏ ఇతర నియోజకవర్గంలో ఇలాంటి ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో లేరు. వీరందరితో పాటు రైతు సహకార సంఘం, మార్కెటింగ్, దేవాలయ తదితర వాటిల్లో ప్రభుత్వం నియమించిన నాయకులు తమ పదవులను చేపడుతున్నారు. అన్ని రకాల పదవులు ఈ నియోజకవర్గంలో ఉండటం గమనార్హం.

అధికారులంతా..

- నియోజకవర్గంలో పాలనపరంగా పంచాయతీ కార్యదర్శి నుంచి కమిషనర్ వరకు తమ విధులను నిర్వహిస్తున్నారు. పంచాయతీ, మున్సిపల్, గ్రేటర్ కార్పొరేషన్లలో గ్రేడ్-1 వరకు అధికారులు తమ బాధ్యతలు చేపడుతున్నారు. ఇతర ఏ నియోజకవర్గాల్లో ఇంత పెద్దస్థాయిలో అధికారులు విధులు నిర్వహించడం లేదు.

మొదటి నుంచి..

- రాజేంద్రనగర్ నియోజకవర్గం ఏర్పడిన అనంతరం 2009లో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ టీడీపీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం జరిగిన రెండు ఎన్నికల్లో ఆయనే విజయం సాధిస్తూ.. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం నాల్గోసారి ఆయన బీఆర్‌ఎస్ పార్టీ తరపున పోటీలో ఉన్నారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఆయనే ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గంలో కొనసాగుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమాలే భారీ మెజారిటీకి దోహదం

బండ్లగూడ: నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చేసిన అభివృద్ధి, సంక్షేమాలే ఆయనను భారీ మెజార్టీతో గెలిపిస్తాయని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలకు మేయర్ దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. కోట్లాది రూపాయలతో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు వాటికి శాశ్వత పరిష్కారాలను చూపించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసిన ఘనత ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కే దక్కుతుందన్నారు. ఆయన విజయం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. ఇంటింటికి తిరుగుతూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ.. నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, గ్రామ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్

ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో అలయ్ బలయ్





అలయ్ బలయ్‌లో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నాయకులు

రాజేంద్రనగర్: దసరా పండుగ సందర్భంగా ముదిరాజ్ మహాసభ రాజేంద్రనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం హిమాయత్‌సాగర్ సోడమ్మ గుట్టపై రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ డి.సత్యనారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుల సోదరులంతా సమావేశమై దసరా శుభాకాంక్షలు తెలుపుకుంటూ.. ఒకరికొకరు అలయ్ బలయ్ చేసుకున్నారు. అనంతరం ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. కులస్తులంతా ఏకతాటిపై ఉంటూ సంఘాన్ని బలోపేతం చేయాలని సూచించారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరికి మద్దతు ఇవ్వాలనే విషయమై ముమ్మరంగా చర్చించారు. కులస్తులు నియోజకవర్గంలో ఏ పార్టీ నుంచి పోటీ చేసినా.. మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు భైరముని మల్లేష్‌ముదిరాజ్, మణికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.నరేందర్‌ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ పెద్దలు ఎం.మహాత్మరావు, కె.నారాయణ, కె.యాదయ్య, ఎం.నర్సింగ్‌రావు, బాలరాజు, రమేష్, ఎం.రాజు ముదిరాజ్, కె.నరసింహ, జి.నర్సింగ్‌రావు, చంద్రకాంత్, శివ, కొండల్ తదితరులున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

మణికొండ: రాజేంద్రనగర్ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున మణికొండ మున్సిపల్ చైర్మెన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌కు ఎమ్మెల్యే టికెట్‌ను కేటాయించటంతో ఆ పార్టీ కేడర్ సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం రాత్రి మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లపై పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా కాల్చటం, స్వీట్లను పంచి పెట్టుకుని నరేందర్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పెద్ద ఎత్తున సంబరాల్లో పాల్గొన్నారు. టికెట్‌ను సాధించిన కస్తూరి నరేందర్‌కు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించుకునేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీతో పాటు కాలనీల సంఘాల నాయకుల ఇళ్లకు వెళ్లి కస్తూరి నరేందర్ వారి ఆశీర్వాదం తీసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారిని కోరారు. తన గెలుపునకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలుపుతున్నారని, వారందరి అండదండలతో గెలుపు దిశగా కృషి చేస్తానని నరేందర్ పేర్కొన్నారు.



మణికొండలో కస్తూరి నరేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

రైతుబంధు దుబారా అనడం తగదు

గచ్చిబౌలి: రైతు బంధు దుబారా అని పీసీసీ మాజీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. రైతుబంధుపై కాంగ్రెస్ పార్టీ అక్కసు వెళ్లగక్కుతూ రైతు వ్యతిరేక పార్టీగా మిగిలిందన్నారు. రైతులకు 3 గంటల కరెంట్ చాలు అని రేవంత్ రెడ్డి , రైతు బంధు దుబారా ఖర్చు అని ఉత్తమ్ అనడం కాంగ్రెస్ అనైతికతకు నిదర్శనమన్నారు. రైతు బంధు రద్దు చేస్తామని బీజేపీ నాయకులు ఈటెల పేర్కొనడం సమంజసం కాదని, ఈలాంటి ప్రతిపక్షాలను నమ్మి ఓటేస్తే రైతులకు కష్టాలు తప్పవన్నారు. ప్రతి పక్షాల కుటిల ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికలలో తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి



యోగేందర్‌కుమార్ మృతదేహం

శంషాబాద్ రూరల్: విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి చెందిన ఘటన నర్కూడలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన యోగేందర్ కుమార్ (32) పెయింటర్ పనిచేస్తూ.. శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని రాళ్లగూడ దొడ్డిలో సోదరులతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 26న నర్కూడలో పెయింటింగ్ పని నిమిత్తం నాగిరెడ్డి ఇంటికి వెళ్లి పనిచేస్తున్నాడు. చేతిలో ఉన్న ఇనుప పైపు భవనం పక్క నుంచి వెళ్తున్న కరెంటు తీగలకు తగిలి కరెంటు షాక్‌కు గురయ్యాడు. దీంతో అతను ఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గచ్చిబౌలి: వాకింగ్ వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ భానుప్రసాద్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్‌లోని రాజరాజేశ్వరీనగర్‌లో ఎస్ఎల్ఎన్ఎస్ కొండపల్లి ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉండే కలవెండి వెంకట అనంత పద్మనాభ శాస్త్రి(67) గురువారం ఉదయం 8.15 గంటలకు వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతనికి వరుసకు అల్లుడైన శ్రీకాంత్ వెతుకుతుండగా రోడ్డుపైన శాస్త్రి స్పృహతప్పి పడిపోతూ విద్యుత్ స్తంభాన్ని పట్టుకొని కిందపడటం చూశాడు. దగ్గరి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో ఉండటంతో వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే అతను మృతి చెందినట్లుగా వైద్యులు ధృవీకరించారు. విద్యుత్ స్తంభాన్ని పట్టుకున్నప్పుడు విద్యుదాఘాతానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సేవ చేసే వారికే ప్రజల్లో గుర్తింపు



షకీల్ అలీ ఖాన్‌కు అవార్డు అందజేస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సేవ చేసే వారికే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం గోల్కొండ రేతి గల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మజ్లీస్ సీనియర్ నాయకుడు షకీల్ అలీ ఖాన్‌కు ఉత్తమ సేవా అవార్డు అందించారు. టీఎఫ్‌సీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మజ్లీస్ పార్టీలో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి అవార్డులు, మెమొంటోలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షకీల్ అలీ ఖాన్ గత రెండు దశాబ్దాలుగా మజ్లీస్‌లో ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. పార్టీ అధిష్ఠానం ఆయనను క్రమ శిక్షణ గల కార్యకర్తగా గుర్తించిందన్నారు. మజ్లీస్ ఎప్పుడు కూడా పని చేసే కార్యకర్తలకే ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టీఎఫ్‌సీవో చైర్మన్ మహ్మద్ నజీబ్, మజ్లీస్ నాయకులు ఆరూన్‌ఫరాన్, ఖాలేద్ అలీ ఖాన్, జుబేర్ బిన్ అవద్, డాక్టర్ మియాజ్ అహ్మద్ ఖాన్, షబ్బీర్ ఖాన్, పి.శివశంకర్, ఏ.సునంద తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో కలిసి పనిచేయాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహ

మణికొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రతి పోలింగ్‌బూత్‌లోను మెజార్టీ సాధించేలా కృషి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ పేర్కొన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మెన్ జి.వెంకటేష్‌యాదవ్ అధ్యక్షతన నార్సింగిలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో చెప్పిన హామీల కన్నా అధికంగా ప్రజలకు పనులు చేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీ, ప్రభుత్వానికి, నార్సింగి మున్సిపాలిటీకి దక్కుతుందన్నారు. భవిష్యత్తులో ఇదే అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరాన్ని ప్రతి ఇంటికి తెలియజేసి వారు మన పార్టీకి ఓటు వేసేలా చేయాలని సూచించారు. పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, నాయకులు యాదగిరి, వట్టినాగులపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు నగేష్‌యాదవ్, మహిళా అధ్యక్షురాలు ప్రియదర్శిని, కో- ఆప్షన్ సభ్యుడు మహమూద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ముస్తాక్, రాజ్‌కుమార్‌లతో పాటు నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించాలి

శంషాబాద్ రూరల్: వచ్చే 30 రోజులు మనందరికి చాలా కీలకమని, నిద్రాహారాలు మానుకునైనా సరే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపుకోసం కృషి చేయాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సూచించారు. మండలంలోని పెద్దషాపూర్ వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం జరిగిన ప్రజా ఆశీర్వాదసభలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వేదికపై ఉన్న తనతో పాటు ఎమ్మెల్యేతో సహా ప్రతి ఒక్కరూ కార్యకర్త లేనని భావించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. ప్రచారం సాగాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సంపదను సృష్టించి సంక్షేమాన్ని అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఇప్పటి వరకు అభ్యర్థుల ఎంపిక కూడా చేయలేదని, యుద్ధానికి మనం ఎప్పటి నుంచో సిద్ధంగా ఉన్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టో తయారు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శంషాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారని తెలిపారు.

ఆధారాలుంటేనే రాయండి : ఎమ్మెల్యే మండిపాటు

తాను కబ్జాలకు పాల్పడుతున్నానని రాస్తున్న వార్తల్లో వాస్తవం లేదని.. ఆధారాలు ఉంటే రాసుకోవచ్చని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం పదేళ్ల నుంచి కృషి చేశానన్నారు. ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ తన్వీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ కాంగ్రెస్ అభ్యర్థి



పేరు: కస్తూరి నరేందర్‌ముదిరాజ్
భార్య : కస్తూరి లావణ్య
కుమారులు: భరత్, భరద్వాజ్
విద్య: ప్రాథమిక విద్య
రాజకీయ నేపథ్యం: 1). 1995 నుంచి 2001వరకు పుప్పాలగూడ గ్రామ సర్పంచ్
2) 2001 నుంచి 2006 వరకు నరేందర్ భార్య లావణ్య సర్పంచ్
3) 1988 నుంచి 1995 వరకు నరేందర్ అన్న బాలరాజ్ సర్పంచ్
4) 2014లో ఎస్సీ రిజర్వేషన్‌లో 14మంది వార్డు సభ్యులు, ఇద్దరు ఎంపీటీసీల గెలుపునకు కృషి
5) 2019 నుంచి ఇప్పటివరకు మణికొండ మున్సిపల్ చైర్మెన్‌గా పనిచేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్త నుంచి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీ పటిష్టతకు కృషి చేశారు. ప్రస్తుతం పీసీసీ ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగారు. పుప్పాల్‌గూడ సర్పంచ్, మణికొండ మున్సిపల్ చైర్మెన్‌గా పనిచేసి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేసిన అనుభవం ఉంది. అనేక సేవా కార్యక్రమాలతో తనకంటూ గుర్తింపు పొందిన మాస్ నాయకుడిగా ఆయనకు పేరు ఉంది. గ్రామ పంచాయతీలుగా ఉన్న సమయంలో నీటి ఎద్దడిని నివారించేందుకు 15 కొత్త ట్యాంకర్లను కొనుగోలు చేసి తన సొంత భూమిలో బోర్లు వేసి ఉచితంగా నీటిని సరఫరా చేసి ప్రజలకు ఎనలేని సేవ చేశారు. పుప్పాల్‌గూడలో కోట్లాది రూపాయలతో శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభింప చేశారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

గోల్కొండ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ దెబ్బకు పాలక బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు దుకాణం మూసుకోవాల్సిందేనని కార్వాన్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి టి.అమర్ సింగ్ అన్నారు. శుక్రవారం పలువురు నాయకులు గుడిమల్కాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు స్వచ్ఛమైన పాలన కోరుకుంటున్నారన్నారు. కేసీఆర్ కుటుంబ పాలనతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందన్న విషయం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఈ ఎన్నికల్లో వారు బీఆర్‌ఎస్‌ను ఓడించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మరోవైపు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు గుండాయిజం చేస్తూ భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ సమర్థవంతమైన పాలనతో దేశం పురోగతి సాధిస్తుండగా తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఆర్థికంగా పూర్తిగా దిగజారిందన్నారు. ఈసారి కార్వాన్‌లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పెరగనున్న రాజకీయ హోరు

- తేలిన ప్రధాన ప్రత్యర్థులు
- తేలని ఎంఐఎం, బీజేపీ అభ్యర్థులు
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కస్తూరి నరేందర్

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఇక రాజకీయాలు ఇక హోరెత్తనున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు అధికార బీఆర్‌ఎస్ పార్టీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌నే తిరిగి అభ్యర్థిగా ప్రకటించి పక్షం రోజులు దాటింది. ఆయనకు ప్రత్యర్థులు ఎవరనేది తేలకపోవడంతో ఇప్పటి వరకు నిస్తేజంగా ఉన్న విషయం అందరికి తెలిసిందే.

- ఎట్టకేలకు ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా మణికొండ మున్సిపల్ చైర్మెన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌ను శుక్రవారం రెండో జాబితాలో ప్రకటించింది. దీంతో నియోజకవర్గంలో ఇక ప్రచార పర్వం జోరందుకోనుంది. మరో ప్రతిపక్ష బీజేపీ పార్టీకి చెందిన అభ్యర్థిని ప్రకటిస్తే ఆ జోరు మరింత పెరగనుంది. మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం, ప్రతి కాలనీ, గ్రామంలో పటిష్ట నాయకులు, కార్యకర్తల బలంతో ఉన్న ప్రకాష్‌గౌడ్‌ను ఢీకొట్టి తమ సత్తా చాటాలనే పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. రాజకీయ, అర్థ, అంగబలం ఉన్న మణికొండ మున్సిపల్ చైర్మెన్ నరేందర్‌ను తమ పార్టీ అభ్యర్థిగా ప్రకటించటంతో వారిలో ఉత్సాహం ఉరకలు వేస్తుంది.
- ఇదే నియోజకవర్గం నుంచి రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను సాధించేందుకు గతంలో రెండుసార్లు పోటీ చేసిన బొర్ర జ్ఞానేశ్వర్ గట్టిగా ప్రయత్నించారు. పార్టీ అధిష్టానం మాత్రం కస్తూరి నరేందర్ వైపు మొగ్గు చూపటంతో టికెట్ ఆయనను వరించింది.

ఒక్కతాటిపై నడిచేరా..?

- రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను ఆశించిన బొర్ర జ్ఞానేశ్వర్, కస్తూరి నరేందర్‌లు ఇద్దరు ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారే కావటం విశేషం. ఇద్దరిలో ఎవరికి టికెట్ వచ్చినా కలిసి పనిచేస్తామని, వేదికలు, విడిగా ఇప్పటి వరకు ప్రకటిస్తూ.. వచ్చారు. ప్రస్తుతం టికెట్ కస్తూరి నరేందర్‌ను వరించడంతో జ్ఞానేశ్వర్ అతనికి సంపూర్ణ మద్దతు ప్రకటించి గెలుపునకు కృషి చేస్తారా..లేక మరేదైనా నిర్ణయం తీసుకుంటారా అనే అనుమానం కొందరు నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఇరువురు నాయకులు ఒక్కతాటిపైకి వచ్చి పార్టీ గెలుపునకు కృషి చేస్తే మాత్రం ప్రకాష్‌గౌడ్‌కు పోటీ గట్టిగానే ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మిగతా పార్టీల ముహూర్తం ఎప్పుడో..

- అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల రణరంగంలోకి దూకేందుకు సిద్ధమయ్యాయి. ఇక మరో ప్రధాన పార్టీలైన ఎంఐఎం, బీజేపీలపై అభ్యర్థులను ఎప్పుడు ప్రకటిస్తారనే చర్చ కొనసాగుతోంది. బీజేపీ పార్టీలో టికెట్‌ను ఆశిస్తున్న వారి మధ్య పోటీ తీవ్రంగానే ఉన్నా.. ప్రస్తుత తరుణంలో గట్టి పోటీ ఇచ్చే అభ్యర్థిగా మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి వైపు పార్టీ అధిష్టానం మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. ఇక మిగిలిన ఎంఐఎం పార్టీలోనూ.. నలుగురి పేర్లు ప్రచారంలో ఉన్నా.. టికెట్ ఎవరికి దక్కుతుందనే విషయం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ ప్రకటించే వరకు వేచి చూడాల్సిందే.